క్లుప్తంగా

వైభవంగా అయ్యప్ప దీపాలంకరణ సేవ



సూర్యపీఠంలో దీపాలంకరణ

పార్వతీపురంటౌన్: మండలంలోని సూర్యపీఠంలో గల శ్రీ హరి హరపుత్ర అయ్యప్పస్వామి శరణు కోటి స్థూపం వద్ద బ్రహ్మశ్రీ వేమకోటి నరహరి శాస్త్రి ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా దీపాలంకరణ సేవ నిర్వహించారు. అయ్యప్పకు సహస్రకమలార్చనను కలువపూలతోను, సహస్ర నామార్చన చేశారు. అనంతరం సకల దేవతా మంత్ర హోమాలు చేశారు. కార్యక్రమంలో మాలాధారణలో ఉన్న శ్రీసూర్య పీఠం అయ్యప్ప సన్నిధాన స్వాములంతా పాల్గొన్నారు.

గ్రామాల్లో కార్తీక వనభోజనాలు



చిన్నమ్మవారిగుడి ఆవరణలో రిగిన వనభోజన కార్యక్రమం

సీతానగరం: కార్తీక మాసోత్సవం, అయ్యప్ప స్వామి పూజలను పురస్కరించుకుని బుధవారం మండలంలోని పలుగ్రామాల్లో రాజకీయాలకు అతీతంగా వనభోజన కార్యక్రమాలు నిర్వహించారు. బళ్లకృష్ణాపురంలో నిర్వాహకులు ఎస్.రామకృష్ణ, సర్పంచ్ బళ్ల జగన్నాథం, మాజీ సర్పంచ్ సింహాచలం ఆధ్వర్యంలో మూడువేల మందికి చిన్నమ్మవారి గుడి ఆవరణలో వనభోజన కార్యక్రమం జరిగింది. అలాగే తామరఖండి గ్రామంలో అయ్యప్ప స్వామి సన్నిధానం ఆవరణలో అయ్యప్ప భక్తులంతా సమకూర్చుకున్న నిధులతో వేలాదిమందికి భిక్ష పెట్టారు.

నేడు దివ్యాంగులకు ఉపకరణాల గుర్తింపు శిబిరం



ఎంపీడీఓ రూపేశ్ కుమార్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండల పరిషత్ కార్యాలయంలో దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయ ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రూపేశ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గుర్తింపు శిబిరాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. చేతి కర్రలు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాల పంపిణీకి అర్హులను గుర్తిస్తామని, ఈ శిబిరాన్ని వినియోగించుకోవచ్చని సూచించారు.

దీక్షల్లో ప్రజా సంఘాల నాయకులు



గురుకుల ఉపాధ్యాయుల దీక్షకు మద్దతు తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

పార్వతీపురంటౌన్: డీఎస్సీ నుంచి ఔట్‌సోర్సింగ్ గిరిజన గురుకుల ఉపాధ్యాయుల పోస్టులు మినహాయించి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు కోరారు. ఈ మేరకు ఐటీడీఏ వద్ద ఔట్‌సోర్సింగ్ గురుకుల ఉపాధ్యాయుల దీక్షకు ప్రజా సంఘాల నాయకులు బుధవారం మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, గ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ వాకాడ ఇందిర, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజు దీక్షల్లో మద్దతుగా కూర్చున్నారు.

రక్తదానం ప్రాణదానం



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న సీఐ హరి

గుమ్మలక్ష్మీపురం: రక్తదానం చేయడం ద్వారా ప్రాణాపాయంలో ఉన్న మరొకరికి ప్రాణదానం చేసినట్లు అని ఎల్విన్‌పేట సీఐ హరి అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో బుధవారం రక్తదానం శిబరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం మండలంలోని ఎంతో మంది గిరిజనలు అత్యవసర సమయంలో రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయడం ద్వారా అటువంటి వారి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. యువత అపోహలు వీడి రక్తదానం చేసేందుకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో 40 యూనిట్లు రక్తం సేకరించినట్లు తెలిపారు.

మిషన్లతో కోత..
పశుగ్రాసానికి కొరత



మిషన్లతో కోస్తున్న పంట

- పశుగ్రాసం లేక మూగజీవాల అవస్థలు
- అధిక రేట్లకు కొనుగోలు చేస్తున్న పాడి రైతులు

బలిజిపేట:

యంత్రాలతో వరికోతలు చేస్తుండడం వల్ల పశుగ్రాసం కొరత ఎక్కువగా కనిపిస్తోంది. దీంతో మూగజీవాలు ఆకలితో అలమటిస్తున్నాయి. పశువులను పెంచుకోవడానికి రైతులే తిరిగి పశుగ్రాసం కొనుగోలు చేయాల్సి వస్తోంది. పశుగ్రాసం కొరతతో కొంతమంది రైతులు పశువులను పెంచలేక విక్రయించుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు. బలిజిపేట మండలంలో ఈ ఖరీఫ్ సీజనులో 18,609ఎకరాలలో వరిసాగు చేశారు. కూలీల కొరత, ఖర్చు ఎక్కువగా ఉండడంతో యంత్రాలతో కోతలు కోసుకోవాల్సి వస్తోందని రైతులు చెప్పారు. ఈ ఖరీఫ్ సీజన్ ఎకరాకు 30నుంచి 35బస్తాల వరకు వరికి దిగుబడి వచ్చినట్టు రైతులు తెలిపారు. పంట బాగున్నా దానిని యంత్రాలతోనే కోయాల్సి వచ్చిందని, మిషన్‌ద్వారా ధాన్యం కోతకు వాటిని బయిటకు తీసుకువచ్చేందుకు కలిపి గంటకు రూ.3,400వరకూ ఖర్చయిందన్నారు. ఎక్కువమంది రైతులు యంత్రాలతో కోతలను చేస్తున్నారు. చేను కోతలు అయిన వెంటనే పొలాల్లోనే గడ్డికి నిప్పుపెట్టి బూడిద చేస్తున్నారు. దీంతో పశుగ్రాసం కొరత ఏర్పడుతోంది.

పశుగ్రాసం కొంటున్నాం

కూలీల కొరత, ఖర్చు ఎక్కువ వల్ల యంత్రాలతో వరికోతలు కోస్తున్నాం. పశుగ్రాసం కొరత అయితే తిరిగి కొనుక్కుంటున్నాం. పశువులు లేనివారికి ఇబ్బంది లేదు. పాలకు ఇబ్బంది పడకుండా ఉండాలంటే పాడి పశువులను మేపుకోవాలి. అందునిమిత్తం పశుగ్రాసం కొనుగోలు చేస్తున్నాం.

– సత్యంనాయుడు, రైతు, వెంగళరాయపురం, బలిజిపేట మండలం

వరి కోతలు ఖర్చుతో పని

కూలీలతో కోతలు కోయించడం ఖర్చుతో కూడుకున్న పని. కూలీల కొరతతో పాటు ఖర్చు ఎక్కువ. పొలం దూరాన్ని బట్టి కూలీలు రేటు డిమాండ్ చేస్తున్నారు. ఎకరా చేనుకోత, ఆరబెట్టిన ఓగులు బడిపెలు వేయడానికి, ధాన్యాన్ని మిషన్‌తో కొట్టించడానికి కలిపి రూ.9వేల వరకు ఖర్చవుతోందని, దీనివల్ల యంత్రాలను ఆశ్రయిస్తున్నామని రైతులు చెప్పారు.

ధాన్యం విక్రయించే రైతులకు సదుపాయాలు కల్పించాలి

సీతానగరం: మండలంలో ధాన్యం విక్రయించే రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, సదుపాయాలు కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బుధవారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రానికి వచ్చిన జాయింట్‌కలెక్టర్ ఎస్ఎస్ శోభికకు వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం విక్రయించాల్సిన రైతులకు నాణ్యమైన గోనెసంచులు ఇవ్వక పోవడం వల్ల కళ్లాల్లో నూర్పిడి చేసిన ధాన్యం ఆరుబయటే ఉంచాల్సి వస్తోందన్నారు. గ్రామాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో దళారుల ప్రవేశంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, బస్తాకు 40 కేజీల ధాన్యం తూకానికి బదులు 42 కేజీలు వంతున తూకం వేస్తున్నారని, మిల్లర్లు బీజీలు సకాలంలో తీయకపోవడంతో సాంకేతిక పరమైన ఇబ్బందులు వస్తున్నాయని, హమాలీలుకు సంబంధించిన బిల్లులు ధాన్యం బిల్లులతోనే ఇవ్వాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా, మండల నాయకులు రెడ్డి ఈశ్వరరావు, బి.అప్పారావు, బి.చిన్నం నాయుడు, జీవీ రమణ, రమణమూర్తి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాల్సిన బాధ్యత అందరిది



బాల్యవివాహాలకు వ్యతిరేకంగా సిబ్బందితో ప్రమాణం చేయిస్తున్న ఎంపీడీఓ రమాదేవి

సాలూరు రూరల్: బాల్య వివాహాలను అరికట్టాలిస్సన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీఓ రమాదేవి అన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద తన సిబ్బందితో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్యవివాహాలు సాంఘిక దురాచారమని గతంలో ఈ విధానంతో మహిళలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవారని ప్రస్తుతం అందరిలోను చైతన్యం వచ్చిందన్నారు. ఇంకా ఇలాంటి వాటిని ఎవరైనా కొనసాగిస్తే అరికట్టాలిస్సన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



పార్వతీపురం టౌన్: సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ రూపేష్ కుమార్

బాల్య వివాహ వ్యవస్థను నిర్మూలిద్దాం

పార్వతీపురంటౌన్: బాల్య వివాహ వ్యవస్థను నిర్మూలిద్దామని ఎంపీడీఓ రూపేష్ కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద సిబ్బందికి అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను వ్యతిరేకంగా సాధ్యమైనంత వరకు ప్రయత్నం చేయాలని సూచించారు. తమ పరిసరాల్లో బాల్య వివాహాలను నిర్మూలించాలని కోరారు. గ్రామాలలో క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీ అభ్యర్థులకు నియామక పత్రాలు



నియామక పత్రాలు అందజేస్తున్న డీఈఓ ఎన్.తిరుపతి నాయుడు

పార్వతీపురంటౌన్: జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న 24 పోస్టులకు గాను 19 పోస్టులకు నియామక పత్రాలను డీఈఓ ఎన్.తిరుపతి నాయుడు బుధవారం అందజేశారు. ప్రిన్సిపాల్–1, పీజీటీ–4, సీఆర్‌టీ –14 పోస్టులను భర్తీ చేసినట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులను అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో డీఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



సమావేశంలో మాట్లాడుతున్న లోక్ అదాలత్ సభ్యుడు, అడ్వకేట్ టి.జోగారావు

పార్వతీపురంటౌన్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని లోక్ అదాలత్ సభ్యుడు, ప్యానల్ అడ్వకేట్ టి.జోగారావు అన్నారు. ఈ మేరకు బుధవారం తాళ్లబురిడి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బాల్య వివాహాలపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు లీగల్ సర్వీసెస్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాల్య వివాహాలను ప్రభుత్వం ఎప్పుడో నిషేధిస్తూ చట్టం చేసిందని, కానీ గ్రామాల్లో లా మందికి అవగాహన లేక తమ పిల్లలకు తెలిసీ తెలియని వయసులో వివాహాలు జరిపిస్తున్నారన్నారు. బాల్య వివాహాలను నిర్మూలించడానికి ప్రభుత్వం బాల్య వివాహాల నిషేధ చట్టం 2006ను రూపొందించిందని వివరించారు. చట్టాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తే కఠినమైన శిక్షలు తప్పవని స్పష్టం చేశారు. ఎవరైతే బాల్యవివాహాన్ని ప్రోత్సహిస్తారో వారికి రెండు సంవత్సరాల జైలు శిక్ష లేదా లక్ష రూపాయల వరకు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. చట్టాలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. బాల్య వివాహాల నిషేధంపై బాల బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అడ్వకేట్స్ రాఘవేంద్ర, కె.శ్రీధర్, ఐఆర్‌పీడబ్ల్యూ ఎన్‌జీఓ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను సీఆర్‌టీలుగా గుర్తించాలి



ఐటీడీఏ ఏపీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పార్వతీపురంటౌన్: అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను సీఆర్‌టీలుగా గుర్తించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.రాజు కోరారు. ఈ మేరకు బుధవారం ఐటీడీఏ ఏపీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు దీక్షలు చేస్తున్నారని, కనీసం ఉన్నతాధికారులు పట్టించుకోని పరిస్థితి ఉందన్నారు. తరగతి గదుల్లో పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులు ఐటీడీఏ ఎదుట దీక్షలు చేపట్టాల్సిన దుస్థితి ఏర్పడిందని, దీని వల్ల విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు టి.అఖిల్ జిల్లా కమిటీ సభ్యుడు కె.డేవిడ్ సాయి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

గుమ్మలక్ష్మీపురం: గిరిజన గురుకుల విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని గిరిజన విద్యార్థి సంఘ నాయకలు దోని సురేష్, పల్ల సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ.. జిల్లాలో ఐటీడీఏ పరిధిలో ఉన్న గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో గత 15 ఏళ్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత లేకపోవడంతో వారంతా మనోవేదనకు గురవుతున్నారన్నారు. ఇటీవల ప్రకటించిన మెగా డీఎస్సీలో గురుకులం పాఠశాల సిబ్బంది స్థానాలను కలుపుతామని ప్రభుత్వం చెప్పడంతో వారంతా ఆందోళన చెందుతున్నారన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్‌లో గిరిజన గురుకుల ఉపాధ్యాయ పోస్టులను మినహాయించాలని, ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని కోరారు. పీఆర్సీ అమలు చేయాలని, సమానం పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేడు నీటి సంఘాల ఎన్నికలపై శిక్షణ

గరుగుబిల్లి: త్వరలో నిర్వహించనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి సిబ్బందికి గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఇరిగేషన్ శాఖ ఏఈ ఎ.ప్రవీణ్‌కుమార్ బుధవారం తెలిపారు. మండలంలోని 13 సాగునీటి చెరువులతో పాటు తోటపల్లి పాత రెగ్యులేటర్ పరిధిలోని కుడి, ఎడమ కాలువలకు నీటి సంఘాల ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈమేరకు ఎన్నికల సిబ్బంది ఈ శిక్షణకు విధిగా హాజరు కావాలన్నారు.

తుఫానుపై అప్రమత్తం



తోటపల్లిలో రైతులకు సూచనలు చేస్తున్న సిబ్బంది

గరుగుబిల్లి: ఫెంగల్ తుఫాన్ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి అన్నారు. ఈమేరకు మండలంలోని 13 రైతు సేవా కేంద్రాల సిబ్బందిని బుధవారం అప్రమత్తం చేశారు. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రైతులు వరికోతలను తాత్కాలికంగా నిలుపుదల చేయాలని సూచించారు. నూర్పిడి చేసిన ధాన్యం వర్షాలకు తడిచిపోకుండా భద్రపరుచుకోవాలన్నారు. విక్రయించిన ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించడం చేయాలన్నారు. రైతులకు ఎక్కడైనా సమస్యవుంటే రైతు సేవా కేంద్రాలలోని సిబ్బందిని సంప్రదించాలన్నారు.

నకిలీ నియామక ఉత్తర్వులపై
సమగ్ర విచారణ జరపాలి



ఐటీడీఏ ఏపీఓకు వినతి పత్రం అందజేస్తున్న గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్

పార్వతీపురంటౌన్: నకిలీ నియామక ఉత్తర్వులపై సమగ్ర విచారణ జరపాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఐటీడీఏ ఏపీఓ, కలెక్టరేట్ ఏఓలకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో అటెండర్ పోస్టులు నియమిస్తూ శ్రీమాత యల్లమాంబ సర్వీస్, చిల్డ్రన్స్ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషనల్ అసోసియేట్ పేరుతో ఉత్తర్వులు ఇస్తూ గిరిజన ప్రాంత యువత నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోందన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మోసాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని, ఐటీడీఏ ద్వారా గిరిజన విద్యా సంస్థల్లో ఎటువంటి ఉద్యోగ నియామకాలు చేపట్టడం లేదని, ఏదైనా ఉంటే ఉద్యోగ ప్రకటన ఇస్తామని అధికారికంగా ప్రకటన చేయాలని విజ్ఞప్తి చేశారు.

మున్సిపల్ పార్కును అభివృద్ధి చేయాలి



మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజుకు సమస్యలను వివరిస్తున్న సీపీఎం నాయకులు

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రంలోని డాక్టర్ సన్యాసిరాజు మున్సిపల్ స్మారక పార్కును అభివృద్ధి చేయాలని సీపీఎం నాయకుడు రెడ్డి వేణు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజుకి పార్కులో ఉన్న సమస్యలు తెలియజేశారు.

దీనికి స్పందించిన కమిషనర్ పార్కులో ఉన్న సమస్యలు, పరికరాల రిపేర్లు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ పార్వతీపురం గ్రేడ్ వన్ మున్సిపాలిటీలో చర్చివీధిలో ఉన్న డాక్టర్ సన్యాసిరాజు ఉద్యానవనంలో చాలామంది ప్రజలు సేద తీర్చుకోవడానికి, వ్యాయామం చేయడానికి, వాకింగ్‌కు, పిల్లలు ఆడుకోవడానికి ఉన్న ఏకైక పార్కులో వ్యాయామ పరికరాలు ఉన్నాయన్నారు. పిల్లలు ఆడుకునేవి ప్రాథమికంగా కొన్ని మరమ్మతుల బారిన పడ్డాయని, ఉన్న బాత్‌రూమ్‌లకు తాళాలు వేసేస్తున్నారని, తాగడానికి మంచినీటి సౌకర్యం లేదన్నారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని అక్కడికి వచ్చిన మున్సిపల్ కమిషనర్‌ను కోరారు.

108 ఉద్యోగులకు అభినందనలు



108 సిబ్బందిని అభినందిస్తున్న కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా కన్వీనర్ బీవీరమణ

పార్వతీపురంటౌన్: పోరాడి విజయం సాధించిన 108 ఉద్యోగులను కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా కన్వీనర్ బీవీ రమణ అభినందించారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో సిబ్బందిని అభినందిస్తూ ఆయన మాట్లాడారు. గడిచిన 20 రోజులుగా 108 ఉద్యోగులు న్యాయమైన సమస్యల పరిష్కారానికి జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టగా ప్రభుత్వం స్పందించి ఈనెల 26న వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆధ్వర్యంలో చర్చలు జరిపి ఉద్యోగులు తెలిపిన 15 డిమాండ్లలో 14 డిమాండ్లను పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని హామీ ఇస్తూ మినిట్స్ కాపీలను అందజేసిందన్నారు. వైద్యారోగ్యశాఖ, ఆర్టీసీ నియామకాల్లో 108 ఉద్యోగులకు వెయిటేజీ కల్పించేందుకు, మరణించిన వారి కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా చెల్లించేందుకు చర్యలు చేపడతామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 108 ఉద్యోగ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తెర్లి వెంకటరమణ, సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కోడ్ తొలగినా ముసుగు తీయరా..?



మెయిన్‌రోడ్డులో ముసుగు తొలగించకుండా ఉన్న వైఎస్సార్ విగ్రహం

సాలూరు: అధికార పార్టీ నేతల సేవలో తలమునకలైన అధికారులకు , ఎన్నికల కోడ్ ముగిసినా ప్రతిపక్ష పార్టీ నేతల విగ్రహాలపై ముసుగులు తొలగించాలన్న విషయాన్ని మరిచిపోయిన పరిస్థితి సాలూరు పట్టణంలో కనిపిస్తోందన్న ఆరోపణలు వినబడుతున్నాయి. ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో అధికారులు హుటాహుటిన ప్రతిపక్ష పార్టీ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయించడం, ఫ్లెక్సీలు తొలగించడం చేశారు.ఈ క్రమంలో అధికార పార్టీ నేతల ఫ్లెక్సీల తొలగింపుపై ఉదాసీనంగా వ్యవహరించారు. దీనిపై సాక్షిలో కథనాలు ప్రచురితమవడంతో అధికారులు తొలగించారు. తరువాత పలు పరిణామాల నేపథ్యంలో ఎన్నికల కోడ్ ఎత్తివేశారు. ఎన్నికల కోడ్ ఎత్తివేసి వారాలు దాటుతున్నా నేటికి పట్టణంలో మెయిన్‌రోడ్డు వద్ద గల వైఎస్సార్ విగ్రహానికి వేసిన ముసుగును అధికారులు తీయలేదు. దీనిపై ప్రజలు నుండి పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

స్వచ్ఛ సుందర పార్వతీపురంగా తీర్చిదిద్దుదాం



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు

పార్వతీపురంటౌన్: ప్రజలందరి సహకారంతో స్వచ్ఛ సుందర పార్వతీపురంగా తీర్చిదిద్దుదామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన పట్టణంలోని 20వ వార్డులో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల వాతావరణంలో మార్పులు, ప్లాస్టిక్ సంచుల వాడకం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి ప్లాస్టిక్ రహిత సంచులను వినియోగించేందుకు ప్రజలు బాధ్యత వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, ఏఎస్ఓ, శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు, మేస్త్రీలు, వార్డ్ కౌన్సిలర్, పెద్ద ఎత్తున స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఉపకరణాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎంపీపీ భాను, తదితరులు

పాలకొండ రూరల్: ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, విభిన్న ప్రతిభావంతులు, వృద్ధులు భవితా కేంద్రం ద్వారా అందించే ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బొమ్మాళి భాను అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం హైదరాబద్‌కు చెందిన అలిమ్ కో సంస్థ సహకారంతో ఏర్పాటుచేసిన ప్రత్యేక శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సంబంధితశాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ కవిత మాట్లాడుతూ శిబిరంలో ఎంపిక చేసిన వారికి త్వరలో ఉపకరణాలు అందజేయనున్నట్లు చెప్పారు.